సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
మంగళవారం | 17 | సెప్టెంబర్ | 2024



సమస్యలు పరిష్కరించాలి
ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని టీజీసీజీటీఏ రాష్ట్ర జనరల్ సెక్రటరీ సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. - 8లో▸



కాలంచెల్లిన మందులతో చికిత్స
వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో కాలం చెల్లిన మందులతో చికిత్స చేశారు. దీంతో రోగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32.3^0 /24.1^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

అడవికేశ్వాపూర్-వెంకిర్యాల

గుట్టలపై సాయుధ శిక్షణ

- కరీంనగర్, నిజామాబాద్, మెదక్, వరంగల్‌కు కేంద్ర బిందువు

జనగామ: తెలంగాణ సాయుధ పోరాటంలో జనగామది ప్రత్యేక స్థానం. భూ పోరాటం మొదలుకొని.. బాబుదొర హత్య.. సాయుధ పోరాట విరమణ వరకు సాగిన ఉద్యమానికి ఈ ప్రాంతం కేంద్ర బిందువు. సాయుధ పోరాటం అనివార్యం కావడంతో 1946 ప్రాంతంలో జనగామ మండలం వెంకిర్యాల-అడవికేశ్వాపూర్ శివారు గుట్టలొద్దిలో సాయుధ శిక్షణ ఏర్పాటు చేశారు. మొదటి విడత శిక్షణ ఎస్‌వీకే.ప్రసాద్, చకిలం యాదగిరిరావు ఆధ్వర్యంలో జరిగింది. గుట్ట పైనుంచి మూడు కిలోమీటర్ల దూరం వరకు శత్రువు కదలికలను కనిపెట్టేలా నిఘా ఉండేది. ఖిలాషాపూర్‌కు చెందిన దళనాయకుడు గుజ్జుల వీరయ్య, దళ సభ్యుడు మండెలగూడం గుజ్జుల నారాయణ, చీటకోడూరుకు చెందిన కొత్తూరు ముకుందారెడ్డి, కొత్త రాంరెడ్డి, కొత్త జనార్దన్‌రెడ్డి, గానుగుపహాడ్‌కు చెందిన గానుగుపాటి నారాయణరెడ్డి, వడ్లకొండ నుంచి దండెబోయిన నరహరి, గాల్‌రెడ్డి, సిద్దెంకి నుంచి గురిజాల రాజమల్లారెడ్డితో పాటు 100 మందికి పైగా తుపాకీ గురిపై మొదటిసారిగా శిక్షణ తీసుకున్నారు. వెంకిర్యాల-అడవికేశ్వాపూర్ గుట్టలు, అటవీ ప్రాంతం కరీంనగర్, నిజామాబాద్, మెదక్, వరంగల్ జిల్లాకు సెక్యూరిటీ జోన్‌గా సాయుధ పోరాట దళాలు ప్రకటించుకున్నాయి. గుంటూరుకు చెందిన ఎస్‌వీకే.ప్రసాదరావు, చకిలం యాదగిరి రావు, ఏసిరెడ్డి నర్సింహారెడ్డి కలిసి ఒకరి తర్వాత ఒకరు ఈ జిల్లాలకు పొలిటికల్ నాయకత్వం వహించి, ఇక్కడి నుంచే కార్యకలాపాలు నిర్వహించారు. ఆయుధ సామగ్రి సైతం గుట్టలొద్దిలో భద్రపర్చేవారు.



అడవికేశ్వాపూర్-వెంకిర్యాల గుట్టలపై సాయుధ శిక్షణ (ఫైల్)

మరిగడి-ఎర్రగొల్లపహాడ్ గుట్టలపై సాయుధ పోరాట విరమణ

మరిగడి-ఎర్రగొల్లపహాడ్ గుండ్లగుట్టపై సాయుధ పోరాట విరమణకు సంబంధించి ఒకే సెంట్రీ కాపలాతో గుట్టపై సుమారు వెయ్యి మంది సుదీర్ఘ సమావేశమయ్యారు. ఈ రహస్య సమావేశానికి పుచ్చలపల్లి సుందరయ్య నెక్కరు ధరించి.. భుజాన గొంగడి.. వీపున తుపాకీతో హాజరుకావడంతో ఉద్యమకారులు చర్చించుకున్నట్లు ప్రస్తుతం బతికి ఉన్న దర్గ్యానాయక్ చెబుతున్నాడు.

వాడవాడనా

త్రివర్ణ పతాకావిష్కరణలు..

- 1948 సెప్టెంబర్ 17న వరంగల్‌లో భారీగా రోడ్లపైకి జనం

హన్మకొండ కల్చరల్: దేశవ్యాప్తంగా సాగిన స్వాతంత్య్ర ఉద్యమం ఫలితంగా 1947, ఆగస్టు 15న భారతదేశం విముక్తి పొందింది. నిజాం కబంధ హస్తాల్లో మగ్గుతున్న తెలంగాణకు మాత్రం విముక్తి దొరకలేదు. తెలంగాణ సాయుధ పోరాటం 1948లో మరింత ఉధృతరూపం దాల్చి చివరకు 1948 సెప్టెంబర్ 17న సాయంత్రం 7గంటలకు నిజాం నవాబు లొంగుబాటు ప్రకటన చేశారు. రేడియోలో ఈ వార్త విన్న ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు భారీగా రోడ్లపైకి చేరుకున్నారు. ప్రజలు గ్రామాల్లోని రజాకారులు, జామీందారుల ఇళ్లలో చొరబడి వారికి కావాల్సిన వస్తువులు, డబ్బు, ధాన్యం తదితర తిండి గింజలను పట్టుకుపోయారు. బానిసత్వం నుంచి విముక్తి లభించింది అంటూ.. నినాదాలు చేశారు.

జెండా ఆవిష్కరణలు..

ఉద్యమ నేతలు ఉత్సాహంగా ఉత్సవాలు నిర్వహించేందుకు పూనుకున్నారు. వరంగల్ తూర్పు కోటలో సర్వోదయ సంఘం ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకం ఎగురవేశారు. వీరమరణం పొందిన బత్తిని మొగిలయ్య స్మారకార్థం వరంగల్ ఎల్లం బజార్‌లో మొగిలయ్య స్మారక మందిరం వెలిసింది. వరంగల్ మండిబజార్‌లోని చార్‌బౌళి ప్రాంతంలో, ఉర్సు కరీమాబాద్‌లోని ఆర్యసమాజ్ కార్యాలయం, స్తంభంపల్లిలోని సర్వోదయ కార్యాలయం, వరంగల్ రైల్వేగేటు వద్ద ఇటికల మధుసూదనరావు ఆధ్వర్యంలో ఆర్య వీరదళం సంబరాలు జరుపుకుంది. ఎల్లంబజారులో పోలీస్‌స్టేషన్‌కు నాలుగు ఫర్లాంగుల దూరంలో ఉన్న బైసా లక్ష్మణ్‌సింగ్ ఇంటిలో జెండా ఆవిష్కరణ చేశారు. ఆజంజాహి మిల్లు కార్మికులంతా సంతోషంతో రోడ్డుపైకి వచ్చి జై తెలంగాణ అంటూ సంతోషంతో పరుగులు తీశారు. కమ్యూనిస్టులు నిజాం ప్రభుత్వానికి అండగా ఉండే దేశ్‌ముఖ్, దేశ్‌పాండే వంటి భూస్వాముల కబంధ హస్తాల్లో చిక్కుకున్న వేలాది ఎకరాలను స్వాధీనం చేసుకొని పేదలకు పంచారు. భూమి కోసం, భుక్తికోసం, నిరంకుశపాలన విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటం చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.



నాటి ఆజంజాహి మిల్లు (ఫైల్)



నూరుద్దీన్, రషీద్‌మియాల

ఆగడాలకు అంతులేదు..

- సాయుధ పోరాట యోధుడు తోడేటి కొమరయ్య

గార్ల: 'గార్లలోని జాగీర్దారు వ్యవస్థలో తహసీల్దార్‌గా ఉన్న నూరుద్దీన్, రషీద్‌మియాల ఆగడాలకు అంతులేకుండా పోయింది. అప్పటి దారుణ పరిస్థితుల్లో ఉద్యమంలోకి వెళ్లాను' అని గార్లకు చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు తోడేటి కొమరయ్య అన్నారు. నాటి తెలంగాణ రైతాంగ పోరాట స్థితిగతులు, ఆనాడు ఈ ప్రాంతంలోని పోరాట పరిస్థితులు, నిర్బంధాలు, ఉద్యమ తీరుతెన్నులను కొమరయ్య సోమవారం 'సాక్షి'కి వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే.. నాటి నిజాం అనుచరుడైన గార్ల జాగీర్దారు నూరుద్దీన్ సైతం ఈ ప్రాంతంలో తన అజమాయిషీ చెలాయిస్తూ దోపిడీ, దౌర్జన్యాలకు పాల్పడేవారు. రజాకార్లకు హెడ్‌గా మిస్కిల్ సాబ్ వ్యవహరించేవాడు. రజాకార్లకు రైఫిల్ ట్రైనింగ్ జీవంజిపల్లిలో ఇచ్చేవాడు. నాడు అందరూ ఉర్దూ మీడియం చదవాల్సిందే అంటూ హుకుం జారీ చేశారు. ప్రజలపై దాడులు చేయడం, దోచుకోవడం, ఉద్యమకారుల ఆచూకీ కోసం అమాయకుల ఇళ్లు సోదా చేయడమే కాక మహిళలపై అత్యాచారాలు, దౌర్జన్యాలకు అంతులేకుండా పోయింది. రజాకార్లు పగలు గ్రామాల్లో ప్రదర్శన నిర్వహిస్తూ 'జిన్నీకా హుకుం సే నెహ్రూకు జుకాదేంగే' అంటూ నినాదాలు చేసేవారు. అప్పట్లో 'నా తెలంగాణ కోటి రతనాల వీణ'.. అంటూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట శంఖాన్ని పూరించిన దాశరథి కృష్ణమాచార్య స్ఫూర్తితో 18 ఏళ్ల యువకుడినైన నేను సామాజిక పరిస్థితులకు ప్రభావితుడినయ్యాను. నిజాం మూకలు రాంపురం గ్రామంలో పచ్చి బాలింతను చెరచడంతోపాటు దుబ్బగూడెం, ముల్కనూరు గ్రామాలపై పడి విచక్షణారహితంగా దాడులకు పాల్పడ్డారు. ప్రజలు ఇళ్లు వదిలిపెట్టి పోయారు . ఆ పరిస్థితులు నన్ను ఉద్యమంలోకి నడిపించాయి. నాడు ఈ ప్రాంత ఉద్యమ కమాండర్‌గా పనిచేస్తున్న తుమ్మల శేషయ్య నాయకత్వంలో దళంలో చేరాను. 1947లో బండ్లకుంట వద్ద సేద తీర్చుకుంటున్న మా దళానికి, రజాకార్ల మధ్య జరిగిన కాల్పుల్లో దామినేని వెంకటేశ్వరరావు, బుచ్చిమల్లు, మరికొంతమంది అమరులయ్యారు. ఈ మహోత్తర పోరాటంలో నేను భాగస్వామి అయినందుకు గర్వపడుతున్నా.



తోడేటి కొమరయ్య

న్యూస్‌రీల్

ప్రజాపాలన వేడుకలకు ఏర్పాట్లు

- కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లి అర్బన్: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించనున్న వేడుకలు షెడ్యూల్ ప్రకారం జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోదెం వీరయ్య హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు జాతీయ పతాక ఆవిష్కరణ ఉంటుందన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఉదయం తొమ్మిది గంటలకు కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు. ఉత్సవాల ఏర్పాట్లను కలెక్టర్ రాహుల్‌శర్మ పరిశీలించారు.

పోదెం వీరయ్యకు స్వాగతం

పోదెం వీరయ్య సోమవారం రాత్రి భూపాలపల్లి రాగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఆర్డీఓ మంగీలాల్ స్వాగతం పలికారు. బొకే అందించి, శాలువా కప్పి స్వాగతం పలికారు.

దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహించనున్న వృత్తి శిక్షణ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏరియా సింగరేణి అధికార ప్రతినిధి మారుతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలోనే టైలరింగ్, బ్యూటీషన్, మగ్గం వర్క్, ఫ్యాషన్ డిజైనింగ్, జూట్ బ్యాగుల తయారీ, డీటీపీ కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పొందేందుకు సింగరేణి కార్మికుల కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల మహిళలు, యువతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 23వ తేదీ వరకు జీఎం కార్యాలయంలో పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో దరఖాస్తు అందజేయాలని సూచించారు.

'మేనేజర్‌ను బదిలీ చేయాలి'

భూపాలపల్లి అర్బన్: తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న కేటీకే 8వ గని మేనేజర్‌పై విచారణ జరిపి గని నుంచి బదిలీ చేయాలని ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జోగు బుచ్చయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గనిని నష్టాల వైపు తీసుకుపోతున్నారని ఆరోపించారు. ఇష్టానుసారంగా విధులు కేటాయిస్తూ బొగ్గు ఉత్పత్తి ఆటంకం కల్పిస్తున్నట్లు తెలిపారు.

19న సర్టిఫికెట్ల పరిశీలన

భూపాలపల్లి అర్బన్: కేజీబీవీలో తాత్కాలిక పద్ధతి పోస్టులకు గతేడాది ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 19న సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న స్పెషల్ ఆఫీసర్స్, పీజీసీఆర్టీ, సీఆర్‌టీ, పీఈటీల తాత్కాలిక నియమకానికి 2023లో ఎంపికైన అభ్యర్థుల్లో 1:3 రోస్టర్ ప్రకారం సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాత డీఈఓ కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 90009 96933 ఫోన్‌నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.



కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన వద్ద క్రేన్ సహాయంలో గోదావరిలో గణనాథుడి నిమజ్జనం..

వినాయకుడికి.. వీడ్కోలు





కాళేశ్వరం దేవస్థానం విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న అధికారులు

గంగమ్మ ఒడికి చేరిన గణపయ్య

- నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు
- వందల సంఖ్యలో తరలివచ్చిన గణనాథుల ప్రతిమలు
- పోలీసుల భారీ బందోబస్తు

కాళేశ్వరం: తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకున్న వినాయకుడిని భక్తులు సోమవారం గోదావరిలో నిమజ్జనం చేసి వీడ్కోలు పలికారు. మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమ గోదావరికి జిల్లాలోని విగ్రహాలతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా వినాయక విగ్రహాలు తరలివచ్చాయి. నిమజ్జన ఏర్పాట్లను అధికారులు దగ్గరుండి పరిశీలించారు.

జిల్లాలోని పల్లెలు, పట్టణాలు, గల్లీగల్లీకి వినాయక విగ్రహాలకు తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజాకార్యక్రమాలు, భజన, భక్తిసంకీర్తనలతో పూజించారు. వినాయకుడికి ఇష్టమైన పిండి వంటలు, పండ్లు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అంగరంగ వైభవంగా మంగళ వాయిద్యాలతో నృత్యాలు, మహిళలు కోలాటం ప్రదర్శనలు, యువత తీన్మార్ డాన్స్‌లతో గణేష్ మహరాజ్‌కీ జై.. గణపతి బప్పా మోరియా, బైబై గణేష్ అంటూ నినాదాలు పలుకుతూ గంగమ్మ ఒడికి సాగనంపారు. కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన వద్ద రెండు చోట్ల ఏర్పాటు చేసిన రెండు క్రేన్‌లతో విగ్రహాలను స్టాండ్‌లపై నుంచి గజ ఈతగాళ్ల సాయంతో గోదావరి నీటిలోకి వదిలి నిమజ్జనం చేశారు. దీంతో గంగమ్మ ఒడికి తనయుడు చేరాడని భక్తుజనం ఆనందంలో మునిగారు. అర్ధరాత్రి వరకు నిమజ్జనం కొనసాగింది.

కాళేశ్వరం దేవస్థానంలో..

కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని పల్లకీలో ఊరేగింపు చేసి భక్తిభజనలతో భక్తులు త్రివేణి సంగమ గోదావరిలో నిమజ్జనం చేశారు. దేవస్థానం సూపరింటెండెంట్ శ్రీనివాస్, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులు

అంతర్రాష్ట్ర వంతెన వద్ద ఏర్పాట్లను కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, ఎస్పీ కిరణ్ ఖరే పర్యవేక్షించారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఎల్‌పీఓ వీరభద్రయ్య, తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ ప్రసాద్, కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య, ఇతర ఏర్పాట్లు చేశారు. డీఎంహెచ్ఓ మధుసూదన్, వైద్యాధికారి సుస్మిత వైద్యసేవలు అందించారు.

పోలీసుల బందోబస్తు

జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాలు, పట్టణాల నుంచి భారీగా విగ్రహాలు తరలి రావడంతో ఎస్పీ కిరణ్ ఖరే ఆధ్వర్యంలో 200 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. నిమజ్జనం బందోబస్తును కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ రామచంద్రరావు పర్యవేక్షించారు. రెస్క్యూ టీం సభ్యులు గోదావరినీటిలో తిరుగుతూ గస్తీ నిర్వహించారు.



గణపురం: తరలివెళ్తున్న భారీ గణనాథుడు

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో..

భూపాలపల్లి అర్బన్: కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన మట్టి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన కలెక్టర్ రాహుల్ శర్మ అనంతరం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నవరాత్రి ఉత్సవాలను భక్తులు దిగ్విజయంగా జరుపుకున్నారని తెలిపారు. విఘ్నాలు, అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా 9 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకున్నారని చెప్పారు. రెండు రోజుల పాటు జరుగనున్న నిమజ్జన కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు ప్రదీప్, సంగీత్, క్యాంపు కార్యాలయ సిబ్బంది శంకరయ్య పాల్గొన్నారు.

గణపసముద్రంలో 100కు పైగా..

గణపురం: నిమజ్జనానికి మండలకేంద్రంలోని గణపసముద్రం చెరువు వద్ద అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. సింగరేణి రెస్క్యూ బృందాలను అందుబాటులో ఉంచారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. చిట్యాల సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. భక్తులు చెరువులోకి వెళ్లకుండా రెస్క్యూటీం సభ్యులతోనే నిమజ్జనాలు చేశారు. గణపసముద్రంలో సుమారు 100కు పైగా గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు.



- మరిన్ని ఫొటోలు 8,9లో▸



కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెనపై నుంచి గోదావరిలో వినాయక విగ్రహం నిమజ్జనం

రద్దీగా జిల్లాకేంద్రం

- కాళేశ్వరం తరలివెళ్లిన గణనాథులు



మంగళహారతులలో వినాయకుడిని నిమజ్జనానికి సాగనంపుతున్న మహిళలు

భూపాలపల్లి అర్బన్: వినాయక నిమజ్జనం సందర్భంగా జిల్లా కేంద్రం సోమవారం రాత్రి రద్దీగా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు జిల్లాలోని నలుమూలల నుంచి వినాయక విగ్రహాలను ఎక్కువ సంఖ్యలో కాళేశ్వరంలోని గోదావరి నదిలో నిమజ్జనం చేసేందుకు భూపాలపల్లి పట్టణం మీదుగా తరలించారు. జిల్లాలో సుమారు 800లకు పైగా విగ్రహాలను వినాయక మండళ్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు పోలీసుశాఖ ధ్రువీకరించింది. నిమజ్జనం సందర్భంగా కాళేశ్వరంతో పాటు లక్నవరం, ఏటూరునాగారం, ఇతర ప్రదేశాలకు విగ్రహాలను డప్పు వాయిద్యాల నడుమ తరలించారు. భూపాలపల్లి పట్టణంలోని పలు కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను సైతం కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో నిమజ్జనం చేసేందుకు తరలించారు. యువకులు, మహిళలు పలురకాల దుస్తులను ధరించి నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. కాలనీల నుంచి వచ్చే వినాయక మండలికి చెందిన వినాయక విగ్రహాల ఎదుట మహిళలు కోలాటం ఆడుతూ.. సాంప్రదాయబద్ధంగా మంగళహారులతో గణపయ్యను గంగమ్మ చెంతకు సాగనంపారు. పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా సీఐ నరేష్‌కుమార్, ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేయగా ఎస్పీ కిరణ్ ఖరే, డీఎస్పీ సంపత్‌రావు పరిశీలించారు.

నిర్వాహకులకు సన్మానం..

నిమజ్జనానికి కాళేశ్వరం వెళ్లే వివిధ ప్రాంతాల నుంచి వచ్చే నిర్వాహకులకు, కమిటీ సభ్యులకు అంబేడ్కర్ సెంటర్‌లో ధర్మవాహిని గణేష్ ఉత్సవ కమిటీ, గణేష్‌చౌక్‌లో ధర్మజాగరణ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వేర్వేరుగా ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమాలకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరుకాగా ఆయనతో పాటు రాష్ట్ర అటవీశాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పోదెం వీరయ్య, కలెక్టర్ రాహుల్‌శర్మ పాల్గొన్నారు.

కులగణన పక్కదారి..

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్ గౌడ్

మొగుళ్లపల్లి: కాంగ్రెస్ పార్టీలోని కొంతమంది బీసీ కులగణనను పక్కదారి పట్టిస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం మొగుళ్లపల్లి మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ స్థాయిలో బీసీల రిజర్వేషన్ల కోసం కులగణన అవసరమని రాహుల్ గాంధీ చెబుతుంటే.. సీఎం మాత్రం కొంతమంది మాట విని రాహుల్ మాట వినడం లేదని విమర్శించారు. బీసీల రిజర్వేషన్ల పెంపునకు..బీసీల జనాభాను నిర్ధారించే కులగణనే ప్రామాణికమని హైకోర్టు స్పష్టంగా తీర్పు ఇచ్చిందన్నారు. హైకోర్టు తీర్పును గౌరవిస్తూ కులగణన కోసం షెడ్యూల్, రూట్ మ్యాప్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీసీలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కులగణన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. బీసీల పట్ల సానుకూలత రాకుంటే ధర్మ పోరాటం చేస్తామని చెప్పారు. ఇప్పటికైనా బీసీలు బానిసత్వాన్ని వీడి పోరాడితే నాయకులవుతారని, లేకుంటే కార్యకర్త కన్నా హీనమవుతారన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచాలనే డిమాండ్‌తో ఈనెల 25న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నాయకత్వంలో చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. బీసీలు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.



దుగ్గొండి: నాచినపల్లిలో కాడెద్దుల బండిపై గణపయ్య

హనుమకొండలోని సిద్దేశ్వరగుండానికి వెళ్తున్న వినాయకులు



నిమజ్జనంలో మానుకోట జిల్లా పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు





ఏటూరునాగారం: గణపతి రథం ముందు నృత్యాలు చేస్తున్న ఓడవాడ రైతు సంఘం సభ్యులు



మహబూబాబాద్ అర్బన్: గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మురళీ నాయక్



భూపాలపల్లిలో కోలాటం ఆడుతున్న మహిళలు



వరంగల్‌లో వినాయకుడిని తీసుకెళ్తున్న భక్తులు



బంధంచెరువులో నిమజ్జనమవుతున్న గణనాథుడు

వినాయకా.. సెలవికా

ముగిసిన గణపతి నవరాత్రోత్సవాలు

- ప్రశాంతంగా నిమజ్జన వేడుకలు
- కనుల పండువగా శోభాయాత్రలు
- కళాకారుల కోలాటాలు..సాంస్కృతిక కార్యక్రమాలు

వినాయకా.. సెలవికా. తొమ్మిది రోజుల పాటు భక్తులతో అశేష పూజలందుకున్న గణపయ్య గంగమ్మ ఒడికి చేరాడు. సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా గణేశ్ నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరిగాయి. నిమజ్జనం సందర్భంగా శోభాయాత్రలు కనుల పండువగా సాగాయి. కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పురవీధులు భక్తులతో నిండిపోయాయి. జై బోలో గణేశ్ మహారాజ్‌కీ జై.. దండాలయ్య.. ఉండ్రాలయ్య అనే నినాదాలతో రహదారులు దద్దరిల్లాయి.

- సాక్షి నెట్‌వర్క్



వరంగల్‌లోని చిన్నవడ్డెపల్లి చెరువులో నిమజ్జనమవుతున్న గణనాథుడు

హనుమకొండలో పల్లకీలో వినాయకుడిని తీసుకెళ్తున్న భక్తులు



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కోలాటం ఆడుతున్న మహిళలు



పర్వతగిరి : మండల కేంద్రంలో వినాయకుడి ఊరేగింపులో నృత్యం చేస్తున్న విశ్వజెనిత్ విద్యార్థులు

మద్యం మత్తులో భార్యపై దాడి

- కత్తితో పొడిచిన భర్త
- మెడకు స్వల్ప గాయం

ఖిలా వరంగల్: ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఇద్దరు పిల్లలు జన్మించగానే మద్యానికి బానిసైన భర్త.. భార్యను వేధింపులకు గురి చేయడం ప్రారంభించాడు. ఆమెను ఎలాగైనా వదిలించుకోవాలని నిర్ణయించుకున్నాడు. అదే మత్తులో కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఆమె మెడ భాగం, చేతులకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు సకాలంలో చేరుకోవడంతో భర్త పరారయ్యాడు. దీంతో ఆమె ప్రాణంతో బయటపడింది. ఈ ఘటన ఉర్సు కరీమాబాద్‌లో జరిగింది. బాధితురాలి కథనం ప్రకారం.. వరంగల్ ఉర్సు కరీమాబాద్ జెండా కాలనీకి చెందిన నూకల మర్రి రాము, అదే ప్రాంతానికి చెందిన రాజశ్రీని నాలుగేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వడ్రంగి వృత్తి చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతేడాదిగా మద్యానికి బానిసైన రాము.. భార్యను తరచూ కొడుతున్నాడు. దీంతో భర్త వేధింపులు తట్టుకోలేక రాజశ్రీ తన పుట్టింటి పక్కన ఓ గదిని అద్దెకు తీసుకుని ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తోంది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం మద్యం మత్తులో రాము.. రాజశ్రీని కత్తితో చేయి, గొంతు భాగాల్లో పొడిచాడు. రక్షించాలని కేకలు వేయడంతో పక్కంటి వారు వచ్చే చూడగా రాము ఘటనాస్థలి నుంచి పరారయ్యాడు. ఈ విషయం తెలియగానే ఇన్‌స్పెక్టర్ మల్లయ్య హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. గాయపడిన మహిళను పరామర్శించి దాడికి గల కారణాలు తెలుసుని ఎంజీఎం తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు అదే రోజు రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.



బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న ఇన్‌స్పెక్టర్ మల్లయ్య

నవలలకు ఆహ్వానం

- అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్టు కార్యదర్శి స్వప్న

విద్యారణ్యపురి: నూతన నవలా రచయితలను ప్రోత్సహించాలని అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్టు నిర్ణయించిందని ఆ ట్రస్టు కార్యదర్శి డి.స్వప్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నవలలకు ఆహ్వానం పలుకుతున్నామని పేర్కొన్నారు. ఇందులో గెలుపొందిన నవలలకు బహుమతులు అందజేస్తామన్నారు. ప్రథమ బహుమతి రూ. 10వేలు, ద్వితీయ బహుమతి రూ. 5వేల పారితోషికం ఇస్తామన్నారు. డిసెంబర్ 24న అంపశయ్యనవీన్ జన్మదినం కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. రచయితలు తమ మొదటి నవలను డీటీపీ చేయించి అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్టు ఇంటి నంబర్ 2–7–71 ఎక్సైజ్‌కాలనీ, హనుమకొండకు చిరునామాకు అక్టోబర్ 31వతేదీలోగా పంపాలన్నారు. నవలకు సంబంధించిన రెండు ప్రతులను పంపాలని పేర్కొన్నారు.

నిబంధనలు..

తెలుగులో రచించిన నవలలకే ఈ పురస్కారం అందజేస్తారు. తెలుగువారు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా తాము రచించిన మొదటి నవల అని ఈ పురస్కారాన్నిపొందేందుకు పంపాల్సి ఉంటుందని తెలిపారు. నవల నిడివి ప్రింట్‌లో 100పేజీలకు తగ్గకుండా 250 పేజీలకు మించకుండా ఉండాలి. ఇతివృత్తం తెలుగు వారి జీవితాలకు సంబంధించి ఉండాలి. నవల రచన 2023–2024 సంవత్సరాల మధ్య జరిగి ఉండాలి. అంతకన్నా పూర్వం రచించిన నవలలకు అవకాశం ఉండదు. వివరాలకు 99892 91299లో సంప్రదించాలని స్వప్న తెలిపారు.

క్షణికావేశంలో యువకుడి ఆత్మహత్య

రాయపర్తి: సోదరుడు మందలించాడనే కారణంతో క్షణికావేశంలో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కొలన్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రావన్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నాగండ్ల నాగరాజు (23) కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో ఆటోలో కూరగాయలు విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై స్నేహితులతో జల్సాలు చేస్తున్నాడు. దీంతో తన సోదరుడు రాజశేఖర్.. నాగరాజును మందలించాడు. దీంతో క్షణికావేశానికి గురైన నాగరాజు ఈనెల 15న హైదరాబాద్ నుంచి ఇంటికి వచ్చాడు. సోమవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళపై లైంగికదాడి

కేసముద్రం: ఇంట్లో ఒంటరిగా ఉన్న ఓ మహిళపై ఇద్దరు యువకులు లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని ఓ గ్రామంలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఓ గ్రామంలో ఈ నెల 10వ తేదీన సాయంత్రం ఓ మహిళ ఇంట్లో ఒంటరిగా ఉంది. గమనించిన అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఆ ఇంట్లోకి ప్రవేశించి ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు ఆధారాలతో ఆదివారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలులో ప్రయాణికుడి మృతి

కాశిబుగ్గ: హజ్రత్ నిజాముద్దీన్ దురంతో ఎక్స్‌ప్రెస్(12269)లో ఓ ప్రయాణికుడు మృతి చెందాడు. జీఆర్పీ సీఐ సురేందర్ కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని జాల్నా జిల్లా దౌస్‌కు చెందిన విశ్వంభర్ (46) తన కుమారుడు ఆకాశంతో కలిసి దురంతో ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ నుంచి జాల్నాకు ప్రయాణం సాగిస్తున్నారు. ఈ క్రమంలో రైలు వరంగల్ స్టేషన్‌కు చేరుకుంటుండగా అనారోగ్య కారణాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ప్రయాణికులు రైల్వే అధికారులకు సమాచారం ఇవ్వగా వారు 108కు తెలిపారు. రైలు వరంగల్ స్టేషన్ వద్ద రాగానే విశ్వంభర్ ప్లాట్‌ఫాం–2లో దింపి పరీక్షలు చేయగా అప్పటికే మృతి చెందాడని 108 సిబ్బంది తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచామని జీఆర్పీ సీఐ సురేందర్ తెలిపారు.



విశ్వంభర్ మృతదేహం

అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

- టీజీసీజీటీఏ రాష్ట్ర జనరల్ సెక్రటరీ సురేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న టీజీసీజీటీఏ రాష్ట్ర జనరల్ సెక్రటరీ సురేందర్‌రెడ్డి

విద్యారణ్యపురి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ గవర్నమెంట్ కాలేజీ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (టీజీసీజీటీఏ) రాష్ట్ర జనరల్ సెక్రటరీ కె. సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన టీజీసీజీటీఏ రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాన్‌క్వాలీఫైడ్‌పై డిగ్రీ కళాశాలల లెక్చరర్లగా పదోన్నతులు పొందిన వారికి రావాల్సిన ప్రయోజనాలను ప్రభుత్వం కల్పించడం లేదన్నారు. 14 సంవత్సరాల నుంచి ఈ సమస్య పెండింగ్‌లో ఉందన్నారు. ఉద్యోగ విరమణ పొందాక కూడా బెనిఫిట్లు ఇవ్వడం లేదన్నారు. ఈప్రయోజనాలు పొందకుండానే 10 సంవత్సరాల నుంచి కొంత మంది ఉద్యోగ విరమణ పొందారన్నారు. అలాగే, ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్లుగా పనిచేసిన పలువురు 2010లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులుగా పదోన్నతి పొందారని, వీరి సర్వీస్‌ను గుర్తించడం లేదన్నారు.ఇప్పటికైనా జూనియర్ కళాశాలల్లో పనిచేసిన సర్వీస్‌ను గుర్తించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. గోపి, ఉపాధ్యక్షుడు జె. చిన్నా, ముఖ్యసలహాదారు బెల్లియాదయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఎల్. మహేశ్, కేయూ కోఆర్డినేటర్ రామకృష్ణారెడ్డి, టీయూ కోఆర్డినేటర్ శ్రీరామ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లారెడ్డి, శాంతకుమార్, రవికుమార్, రమణ, వెంకన్న, అశోక్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇటీవల కవినాగదాసు స్మారక పురస్కారం పొందిన అధ్యాపకుడు డాక్టర్ బెల్లి యాదయ్యను ఈ సందర్భంగా సన్మానించారు.



వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మేయర్

కాజీపేట డివిజన్ అయినప్పుడే

సంతృప్తి..

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా నాగ్‌పూర్ –సికింద్రాబాద్ మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రవేశ పెట్టడం సంతోషకరమని, సౌత్ ఇండియాకు సెంట్రల్ పాయింట్‌గా ఉన్న కాజీపేట జంక్షన్ రైల్వే డివిజన్ అయినప్పుడే ఈ ప్రాంత ప్రజల కల నిజమై సంతృప్తిగా ఉంటుందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. కాజీపేటకు సోమవారం రాత్రి 10.10 గంటలకు చేరుకున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి.. గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, రైల్వే ఏడీఆర్ఎం గోపాల్, ఏసీఎం ఐఎస్ఆర్.మూర్తితో కలిసి ప్రారంభించారు. అంతకు ముందు జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు కలగా ఉన్న కాజీపేట జంక్షన్ రోజురోజుకూ తరిగిపోతుందని, కాజీపేటకు పూర్వవైభవం తీసుకురావాలన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ కాజీపేట మీదుగా వందేభారత్ ప్రారంభించడం సంతోషకరమని, ఈ ప్రాంత చిరకాల వాంఛ కాజీపేటకు రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే ఏడీఆర్ఎం గోపాల్ మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను వర్చువల్‌లో ప్రారంభించారని, మేకిన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా వందేభారత్‌లను ప్రవేశపెట్టారన్నారు. సెమి హైస్పీడ్ వేగంతో తక్కువ సమయంతో నడుస్తుందని, అమృత్ భారత్ పథకంలో రూ.30 కోట్లతో కాజీపేట జంక్షన్ రీమోడలింగ్ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం క్రీడల్లో పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రైల్వే సీనియర్ డీఈఈ ప్రశాంత్ కృష్ణసాయి, డీఈఎన్ ప్రంజల్‌కుమార్, సీసీఐలు సజ్జన్ లాల్, రాజ్‌గోపాల్, సీటీఐ విజయ్‌కుమార్, రైల్వే ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, కాంగ్రెస్ నాయకులు ఈవీ.శ్రీనివాస్, ఎం.డి.అంకూస్, గుటి కుమార్, రైల్వే డీఆర్‌యూసీసీ మెంబర్లు చిర్ర నర్సింగ్, భగవాన్, చాంద్‌పాషా, ఇ.కరుణాకర్ పాల్గొన్నారు.

‘స్మార్ట్’ వలలో విలవిల..

స్మార్ట్‌ఫోన్.. ప్రస్తుతం యువతను తన కట్టుబానిసగా చేసుకుంటున్న పరికరం. భోజనం చేస్తున్నా.. నిద్రిస్తున్నా.. పని చేస్తున్నా.. ఇలా ప్రతి సందర్భంలో సెల్‌ఫోన్ లేనిదే రోజు గడవదంటే అతిశయోక్తి కాదు. ఫోన్ స్క్రీన్‌పై మునివేళ్లు వేగంగా కదిలిస్తూ తమలో తామే నవ్వుకుంటున్నారు.. ఉద్రేకపడుతున్నారు. ఈ చిత్రాలు యువత సెల్‌ఫోన్లకు బానిసలవుతున్న తీరును తెలుపుతున్నాయి. సెల్‌ఫోన్ వినియోగం స్నేహితులు, బంధువులను కలుపుతున్నా.. ఆరోగ్యాన్ని పాడు చేస్తోందనే వాస్తవాన్ని మాత్రం ఎవరూ గ్రహించలేకపోతున్నారు. కుదిరితే నాలుగు మాటలు.. లేదంటే చాటింగ్ అన్నట్లు సాగుతోంది. చిన్నాపెద్ద అనే తేడా లేకుండా రాత్రి కూడా నిద్రకు దూరమై కాలాన్ని దుర్వినియోగం చేసుకుంటూ తెలియకుండానే ఎందరో తమ సంతోషాన్ని కోల్పోతున్నారని నిపుణులు పేర్కొంటున్నారు.



- అర్ధరాత్రి వరకూ చాటింగ్ చేస్తున్న యువత
- ఫలితంగా ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం
- తగ్గుతున్న జీవన నైపుణ్యాలు

కాజీపేట: ఆన్‌డ్రాయిడ్ సెల్‌ఫోన్లు మార్కెట్‌లో రూ. 5వేల నుంచి రూ.లక్షకు పైగా వివిధ ఫీచర్లతో అందుబాటు ధరల్లో యువతరాన్ని ఆకర్షిస్తున్నాయి. ఫలితంగా ప్రతి ఇంట్లోనూ లెక్కు మించిన ఫోన్లు దర్శనమిస్తున్నాయి. ప్రతి ఇంట్లో కనీసం రెండు, మూడు ఫోన్లకు తక్కువ కాకుండా ఉంటున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 45 లక్షలకు పైగా జనాభా ఉండగా వారిలో యువత సుమారు 15లక్షల మంది వరకు ఉంటుందని అంచనా.

సీఈడబ్ల్యూ రీసెర్చ్..

అమెరికాకు చెందిన సీఈడబ్ల్యూ సంస్థ సెల్‌ఫోన్ల వినియోగంపై ఇటీవల అనేక పరిశోధనలు చేసింది. వారి వివరాల ప్రకారం.. మార్కెట్‌లో సెల్‌ఫోన్లు చౌకధరల్లో లభిస్తుండడంతో పాటు డేటా తక్కువ ధరల్లోనే వస్తుండడంతో అన్ని విషయాలను మరచి యువత దాదాపు 25 శాతానికి పైగా ఇంటర్‌నెట్‌లోనే కాలం గడుపుతోంది. సామాజిక మాధ్యమాల్లో విహరిస్తోంది. దీంతో వారి జీవన నైపుణ్యాలు క్రమంగా తగ్గుతున్నాయి. మానవ సంబంధాలకు దూరంగా ఉంటున్నారని రీసెర్చ్ హెచ్చరిస్తుంది.

సర్వేలు ఏం చెబుతున్నాయి..

సెల్‌ఫోన్ల వినియోగంతో యువతరం బానిసలుగా మారుతున్నట్లు వివిధ సర్వేలు చెబుతున్నాయి. విచిత్రమేమంటే ప్రపంచంలో అధికంగా సెల్‌ఫోన్లు తయారు చేసే దేశాల్లో వినియోగం పరిమితంగానే ఉంది. అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో వాటి వినియోగం గణనీయంగా పెరుగుతోందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

నిద్రకు దూరమవుతున్న యువత..

సెల్‌ఫోన్ల వినియోగం గణనీయంగా పెంచిన యువత నిద్రలేమికి గురవుతున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. కనీసం 8 నుంచి 10 గంటలపాటు నిద్రపోవాల్సి ఉండగా చాలా మంది కేవలం 4 నుంచి 6 గంటలలోపు మాత్రమే నిద్రిస్తుండడంతో మానసిక సమస్యలు నానాటికీ పెరిగిపోతున్నాయి. రాత్రి 12 గంటలు దాటిన చేతిలో సెల్‌ఫోన్‌తోనే సహవాసం చేస్తున్నారు. అది కళ్లు, మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతోందనే వాదనలు ఎవరూకాదనలేని వాస్తవం.

రోగాలకు హేతువులు..

ఇయర్‌ఫోన్స్ వినియోగం వినికిడి లోపానికి కారణమవుతోంది. ఈ సమస్యతో బాధపడున్న కేసులు రోజు సుమారు 250కి పైగా వివిధ ఆస్పత్రుల్లో నమోదవుతుండగా వాటిలో సగటున 10 నుంచి 15 కేసులు హెడ్‌ఫోన్ల వల్లే ఉంటున్నాయని వైద్యులు చెబుతున్నారు. విపరీత సెల్‌ఫోన్ వినియోగం వల్ల శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతోందంటున్నారు.

వయసుల వారీగా సెల్‌ఫోన్ల వినియోగం ఇలా...

వయసు	వినియోగిస్తున్న శాతం
06-15	35
16-25	81
26-35	72
36-45	61
46-55	43
56 పైబడిన వారు	39

పరిమితి దాటితే అనర్థాలే..

ఏ విషయంలోనైనా హద్దులు దాటితే అనర్థాలు తప్పవు. సెల్‌ఫోన్ అధికంగా వినియోగించడం వల్ల మానసిక కుంగుబాటుకు గురవుతున్నట్లు పలు అధ్యయనాల్లో తేలింది. వారిలో వింత ప్రవర్తనలు కనిపిస్తున్నాయి. ఆరోగ్యంగా ఉండాలంటే నిద్రకు ప్రాధాన్యం ఇవ్వాలి. యోగా, ధ్యానం, వ్యాయామానికి నిత్య జీవితంలో ప్రాధాన్యం ఇవ్వాలి.



- డాక్టర్ బారుపాటి గోపి, మానసిక నిపుణుడు

కాలం చెల్లిన మందులతో చికిత్స

- రోగికి తీవ్ర అస్వస్థత
- వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఘటన






వర్ధన్నపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అశోక్, కాలం చెల్లిన మాత్రలు

వర్ధన్నపేట: వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో కాలం చెల్లిన మందులతో చికిత్స చేశారు. దీంతో రోగి తీవ్ర అస్వస్థకు గురయ్యాడు. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయపర్తి మండలానికి చెందిన బండారి అశోక్‌కు జ్వరం వచ్చింది. దీంతో సోమవారం వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించుకోగా డాక్టర్లు మందులు రాసి ఇచ్చారు. ఆ మందులు ఆస్పత్రి ఫార్మసీలోనే తీసుకున్నాడు. చికిత్సలో భాగంగా సెఫిక్సిమ్ డిస్‌పర్సిబుల్ మాత్ర (ట్యాబ్లెట్) ఒకటి వేసుకున్నాడు. 15 నిమిషాల్లోనే అశోక్ అస్వస్థకు గురికావడంతో కుటుంబీకులు ఆందోళన చెందారు. వెంటనే మాత్రను పరిశీలించారు. ఇందులో మాత్ర తయారైంది మార్చి 2023లో, కాలం గడువు (ఎక్స్‌పైరీ) ఆగస్టు 2024 తేదీ కనిపించింది. దీంతో ఆ మాత్ర ఎక్స్‌పైరీ అయిందని గుర్తించారు. డాక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే చికిత్స ప్రారంభించడంతో అశోక్ కొంత వరకు కోలుకున్నాడు. ఈ విషయంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ రామ్మూర్తిని వివరణ కోరగా తాను సెలవులో ఉన్నానని, ఈ విషయంపై తనకు సమాచారం ఇచ్చారన్నారు. తాను సిబ్బందిని ఫోన్‌లో ప్రాథమికంగా విచారణ చేశానన్నారు. తమ ఆస్పత్రిలో ఆ మాత్రలు అక్టోబర్ వరకు ఎక్స్‌పైరీ తేదీ ఉందని, ఆ మాత్రలు తమ ఆస్పత్రి నుంచి ఇచ్చారా లేదా అనే అంశంపై విచారణ చేపడుతానన్నారు. తమ ఆస్పత్రి నుంచి ఇస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

వృథాగా బతుకమ్మ చీరలు..

- సోమిడిలో అటకెక్కిన పంపిణీ కార్యక్రమం



కమ్యూనిటీ హాల్‌లో వృథాగా ఉన్న బతుకమ్మ చీరలు

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి ప్రభుత్వ నూతన కమ్యూనిటీ హాల్‌లో బతుకమ్మ చీరలు వృథాగా ఉన్నాయి. బతుకమ్మ పండుగ సందర్భంగా పేద మహిళలకు పంపిణీ చేయడానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు 25వేల చీరలు కేటాయించింది. వీటి పంపిణీకి అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో చీరల పంపిణీ అర్ధాంతరంగా నిలిచింది. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం కొలువుదీరి దాదాపు పది నెలలు కావొస్తున్నా చీరల పంపిణీపై ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు. ఫలితంగా చీరలు వృథాగా పడి ఉన్నాయి. వీటిని పంపిణీ చేయడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేస్తే తప్ప తాము ఏమి చేయలేమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే నిర్ణయం తీసుకోవాలని పలువురు మహిళలు కోరుతున్నారు.